క్లుప్తంగా

తాండూర్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తాండూరు: తాండూరు మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో బాలాజీ మందిర్ కల్యాణ మండపంలో యశోదా ఆస్పత్రి వైద్యుల సౌజన్యంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా స్కానింగ్, ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్వాడీ యువమంచ్ ప్రతినిధులు మన్మోహన్‌సార్డా, బ్రిజ్‌మోహన్, కిషన్‌రాఠీ, అరుణ్‌సార్డా, దినేష్‌పర్తాని, శ్రీగోపాల్‌రాఠీ, అనిల్ సార్డా, దీపక్‌బూబ్, అభిషేక్, రోహిత్‌సోని, యశోదా ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఇంటర్ విద్యను బలోపేతం చేద్దాం

జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శంకర్


ప్రిన్సిపాల్స్‌తో సమావేశమైన ఇంటర్ నోడల్ అధికారి

వికారాబాద్ అర్బన్: ఇంటర్ విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎస్.శంకర్ తెలిపారు. శనివారం జిల్లా ఇంటర్మీడియెట్ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను షెడ్యూల్ ప్రకారం ఇంటర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. సోమవారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం అవుతున్నందున విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు అందేలా చూడాలన్నారు. ఈనెల 12 నుంచి నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఇంటర్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన కళాశాలలను అభినందించారు.

మిట్టకోడూర్‌లో నీటి కటకట

- నాలుగు నెలలుగా సరఫరా కాని భగీరథ నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఖాళీ బిందెలతో గ్రామస్తుల నిరసన

పరిగి: మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామంలో నాలుగు నెలలుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రజలు భగీరథ ట్యాంకు ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రతి రోజు నీళ్ల కోసం బిందెలు పట్టుకుని పొలాలకు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో భగీరథ నీరు కావాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంత చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోజూ భగీరథ నీరు ఒకటిరెండు బిందెలు మాత్రమే వదిలి నీటి సరఫరాను నిలిపివేస్తున్నారు నిత్యం రూ.20 వెచ్చించి ఫిల్టర్ క్యాన్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి గ్రామాలో భగీరథ నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ముగ్గురు రైతులకు తీవ్ర గాయాలు
- దశాబ్ది ఉత్సవాలకు హాజరై వెళ్తుండగా ఘటన




గాయపడిన రైతులు

ధారూరు: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రైతు దినోత్సవానికి హాజరై తిరిగి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. తాండూరు– ధారూరు ప్రధాన రోడ్డులోని రాంపూర్ తండా వద్ద శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాంపూర్‌తండాకు చెందిన రైతులు దేవియానాయక్, హక్యానాయక్, శంకర్ ధారూరు రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం వీరు ముగ్గురు బైక్‌పై తిరిగి వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన వీరిని వెంటనే తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఢీకొట్టిన కారు కోసం గాలిస్తున్నారు.


కుల్కచర్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి



మర్పల్లి: మాట్లాడుతున్న ఎంపీపీ లలిత

రైతుబంధు, రైతు బీమా దేశానికే ఆదర్శం

రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ సర్కారు లక్ష్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా శనివారం రైతువేదికల్లో నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో బీఆర్‌ఎస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆయా పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పలుచోట్ల నేతలు ఎడ్లబండ్లపై ర్యాలీగా రైతువేదికలకు వచ్చారు. ఎరువుల కొరత లేకుండా సాగునీటికి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


చౌడాపూర్‌లో ర్యాలీలో నేతలు, రైతులు


బంట్వారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్


తాండూరు: వేడుకల్లో మార్కెట్ కమిటీ సభ్యులు, సిబ్బంది


యాలాల: మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా


పెద్దేముల్: నాగలితో ర్యాలీగా వస్తున్న రైతులు


దౌల్తాబాద్: ఎడ్లబండ్లపై వస్తున్న రైతులు


బొంరాస్‌పేట: పల్లెదవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి


మోమిన్‌పేట: ర్యాలీగా వెళ్తున్న నాయకులు, రైతులు


నవాబుపేట: చించల్‌పేట సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

‘డబుల్’ ఇళ్లు కేటాయించండి

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి జర్నలిస్టుల వినతి

తాండూరు టౌన్: జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు శ్రీనివాసచారి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సాక్షి రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉందన్నారు. గతంలో సీఎం కేసీఆర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని అనేకసార్లు చెప్పారన్నారు. ఇచ్చినమాట ప్రకారం వెంటనే జర్నలిస్టులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. ఇటీవలే మహబూబ్‌నగర్ జిల్లాలోని జర్నలిస్టులకు మంత్రి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిందన్నారు. తాండూరు నియోజకవర్గ జర్నలిస్టుల సంక్షేమం కోసం స్థానిక ఎమ్మెల్యేగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని పైలట్ రోహిత్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులు నర్సింహులు, రాంచందర్, నిరంజన్, శివ, పాండు, గయాజ్, వంశీ, వరప్రసాద్, ముక్తార్, లక్ష్మారెడ్డి తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.


ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చలో బస్ భవన్‌ను విజయవంతం చేద్దాం

తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్

అనంతగిరి: తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 14న చేపట్టనున్న చలో బస్ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు తెలిపారు. ఈమేరకు శనివారం వికారాబాద్ డిపో ఎదుట భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. టీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే వేతన సవరణలు చేపట్టాలన్నారు. యూనియన్ ఎన్నికలు జరపాలన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని.. డీఏలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీవీకే రెడ్డి, సుదర్శన్, అనంతయ్య, వసంత్, ఆంజనేయులు, లక్ష్మణ్, అమర్‌నాథ్, ఖాజా, భూషణం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


బస్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

మేమున్నామని..

- తండ్రి చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఎంబీబీఎస్ విద్యార్థిని
- దత్తత తీసుకున్న కిసాన్ బంధు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు


విష్ణుప్రియను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

తాండూరు టౌన్: నిరుపేద కుటుంబంలో పుట్టి జాతీయస్థాయి నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకుతో ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్న విష్ణుప్రియకు కిసాన్ బంధు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్నేహ, సతీష్ అండగా నిలిచారు. ఆమె తండ్రి ఇటీవల మృతిచెందగా ఆమెను దత్తత తీసుకుని అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా మద్గుం చిట్టంపల్లి గ్రామానికి చెందిన ఆవిశపల్లి లాలయ్య, వెంకటమ్మ దంపతులకు నలుగురు ఆడపిల్లలు. పెద్ద కూతురు విష్ణుప్రియ పదో తరగతి తాండూరులోని టీఎస్ గురుకులం, ఇంటర్ వికారాబాద్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో చదివింది. తొలి ప్రయత్నంలోనే నీట్ పరీక్షలో ర్యాంకు సాధించి మహబూబ్ నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం పూర్తిచేసుకుంది. అయితే గతేడాది అక్టోబర్‌లో విష్ణుప్రియ తండ్రి లాలయ్య చనిపోవడంతో ఆమె చదువుకు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవీందర్ గౌడ్, కవయిత్రి మొల్ల కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్, కిసాన్ బంధు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కలిసి సహాయం కోరారు. వెంటనే స్పందించిన సంస్థ ప్రతినిధులు స్నేహ, సతీష్ ఎంబీబీఎస్ పూర్తయ్యేవరకు విష్ణుప్రియను దత్తత తీసుకుంటామన్నారు. అలాగే చదువు కోసం ప్రతి ఏటా రూ.లక్ష వరకు అందిస్తామన్నారు. కిసాన్ బంధు సంస్థ ప్రతినిధుల దాతృత్వాన్ని కలెక్టర్ నారాయణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగం లక్ష్మీబాయి గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమ్మ తదితరులు ఉన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

- బడిబాటలో ఉపాధ్యాయులు
- చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన

పెద్దేముల్: పెద్దేముల్ మండలంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంబాపూర్, గోట్లపల్లి, మారేపల్లితండా, పెద్దేముల్, కందనెల్లి, ఇందూరు, తట్టెపల్లి, అడ్కిచెర్ల, పాషాపూర్‌తో పాటు పలు గ్రామాలల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో పిలల్లను చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ నెల 3 నుంచి 9 వరకు ఆవాస ప్రాంతాల్లో ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక నమోదు, 12న బడిబాట, మనబస్తీ మనబడి కార్యక్రమం, 13న తొలిమెట్టు, 14న విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం, 15న ప్రత్యేక అవసరాల పిల్లల నమోదుపై దృష్టి, 16న ఆంగ్ల మాధ్యమ తరగతుల నిర్వాహణపై తల్లిదండ్రులు, విద్యార్థులకుఅవగాహన కార్యక్రమం, 17న బాలిక విద్య, ప్రాముఖ్యత, ఉన్నత చదువుల పాధాన్యతపై అవగాహన కల్పించుట వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

పిల్లలను పనుల్లో పెట్టకూడదు..

కొడంగల్ రూరల్: బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని జీసీపీఎస్ హెచ్‌ఎం రాములు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను పనుల్లో పెట్టకూడదని.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు, నాణ్యమైన విద్యా బోధన ఉంటుందని తెలిపారు.


మంబాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రైవేట్ దీటుగా ఫలితాలు..

తాండూరు టౌన్: ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ అన్నారు. శనివారం ఆమె మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌తో కలిసి వార్డు పరిధిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు మాధవి, రాణి పాల్గొన్నారు.

దోమ మండల కేంద్రంలో..

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వాతితో కలసి బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వనాథ్‌పూర్ పాఠశాల ఆధ్వర్యంలో..

యాలాల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం విశ్వనాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ అశోక్, హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డితో కలిసి ఎంఈఓ బడిబాట నిర్వహించారు.

చెల్లాపూర్ గ్రామంలో..

కుల్కచర్ల: ప్రభుత్వ బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటుగా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని చెల్లాపూర్ సర్పంచ్ చంద్రయ్య అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామంలో చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవులానాయక్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు దస్తయ్య, నాయకులు అనంతయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఏమైంది?

జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్

పెద్దేముల్: రైతు రుణమాఫీ చేయకుండా రైతుల సంబురాలు చేయడం దేనికి సంకేతం అని పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ ప్రభుత్వంపై మండిపడ్డాడు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఏళ్లు దాటినా నేటికీ చేయకపోవడంపై మండిపడ్డారు. బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గ్రామ సర్పంచ్ విజయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అంబరప్ప, మాజీ సర్పంచ్‌లు కిషన్‌రావు, బాలప్ప, ఆర్‌ఐ రాజిరెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ వెంకటపతిరాజు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

9న చేవెళ్లలో ఎమ్మార్పీఎస్ సదస్సు

తాండూరు టౌన్: ఈనెల 9వ తేదీన చేవెళ్లలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సదస్సు నిర్వహించనున్నట్లు మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ మాదిగ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటంలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామని.. విజయవంతం చేయాలని కోరారు.

రైతు దినోత్సవం కాదు.. దగా దినోత్సవం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు

దౌల్తాబాద్: రైతుదినోత్సవం అంటూ ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న ఉత్సవాలను రైతు దగా దినోత్సవం అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రావు అన్నారు. శనివారం దౌల్తాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఓ వైపు రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో నానా అవస్థలు పడుతుంటే రైతుదినోత్సవం జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. రైతుల వద్ద బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోలు తరుగు తీస్తూ మోసం చేస్తుంటే అధికార బీఆర్‌ఎస్ నేతలు ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. రుణమాఫీ హామీ ఏమైందన్నారు. ఓ వైపు రైతులు అవస్థలు పడుతుంటే సంబురాలు చేసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, రాములు, భీములు, మాధవరెడ్డి, దస్తప్ప, సాయిలు తదితరులున్నారు.


కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న వెంకట్‌రావు

బస్తీ దవాఖానలో నాణ్యమైన వైద్య సేవలు

మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్


బస్తీ దవాఖానను పరిశీలిస్తున్న అశోక్

పరిగి: బస్తీలో ఉన్న ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం బస్తీ దవఖాలను ఏర్పాటు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు ఎర్రగడ్డపల్లిలో నిర్మిస్తున్న బస్తీ దవాఖానను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో బస్తీ దవఖానను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయడంతో నిరుపేదలకు స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలను అందుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్ నాగేశ్వర్, రవీందర్, నాయకులు గౌస్, పాష, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.